క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ప్రతి నెలా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 1,200 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరం అనంతరం పాల్గొన్న వైద్యులను ట్రస్ట్ డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలుట్ల రంగస్వామికి వెండి శంఖం కానుక



వెండి శంఖాన్ని అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామ సమీపంలో వెలసిన పాలుట్ల రంగస్వామి వారికి బేతంచెర్ల పట్టణానికి చెందిన కందగడ్డల రంగయ్య కుమారులు జానార్దన్, గిరిధర్ రూ.25 వేల విలువ చేసే వెండి శంఖం కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకులు విష్ణువర్ధన్ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రతి హిందువు గీతాపారాయణం చేయాలి



భగవద్గీత విశిష్టతను వివరిస్తున్న రఘునందన్ ప్రభూజీ

డోన్ టౌన్: ప్రతి హిందువు భగవద్గీత పారాయణం చేసి, సనాతన హిందూ ధర్మాన్ని తెలుసుకుని ఆచరించాలని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి రఘునందన్ ప్రభూజీ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఇస్కాన్ కేంద్రంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. అనంతరం రాజభోగ హారతి, ఆశీర్వాదం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రఘునందన్ ప్రభూజీ మాట్లాడుతూ.. అందరూ భగవద్గీత చదవాలని.. ధర్మ ప్రచారంలో ప్రతి ఒక్కరు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలను అభినందిస్తున్న ఎస్‌ఐ

బేతంచెర్ల: ప్రమాద సమయంలో బాధితులకు అందించే రక్తదానం ప్రాణదానంతో సమానం అని ఎస్‌ఐ రమేష్‌బాబు, పారిశ్రామికవేత్త గౌరి హుసేన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓం శాంతి నిలయంలో రాజయోగిని ప్రకాశ మణి పుణ్యస్మృతి దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారి మాధవి, లైఫ్ యువనేత్ర సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 67 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఓం శాంతి సభ్యులు నాగ సురేంద్ర, సంజీవయ్య, అంకన్న, బాబన్న, వెంకటరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్యాపిలి: పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న యూటర్న్ వద్ద ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఒకరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరొకరిని డోన్‌కు తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియరాలేదు.

వాహనాల తనిఖీ

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో ఎస్‌ఐ రమణయ్య ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. కోవెలకుంట్ల, అవుకు, తాడిపత్రికి వెళ్తున్న వాహనాలను ఆపి లైసెన్స్, ఆర్సీ, రోడ్డు ట్యాక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. సరైన పత్రాలు చూపని 20 వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నియమాలను పాటించాలని లేకుంటే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

మట్టి గణపతికి జై కొడదాం

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణానికి చేటు
- మట్టి విగ్రహాలతోనే ప్రకృతికి మేలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పర్యావరణ ప్రేమికులు
- ఈనెల 27న వినాయక చవితి



మట్టి ప్రతిమ

డోన్: విఘ్నాలు తొలగించే దేవుడు.. సకల శుభాలు కలిగించేవాడు వినాయకుడు. ఇలాంటి స్వామి విగ్రహాలను రసాయన రంగులతో ఏర్పాటు చేస్తుండడంతో అవి పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా గణనాథుల నిమజ్జనం తర్వాత చెరువులు, కుంటలన్నీ టన్నుల కొద్ది కరగని వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు, నీటి వనరులు పాడైపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్యానికి ఏమాత్రం హాని కలిగించకుండా ఉండే ఎకో విగ్రహాలనే పూజించాలని పర్యావరణ ప్రేమికులు, శాస్త్రవేత్తలు కోరుతున్నారు. వినాయక చవితి పూజలో చెరువులోని బంకమట్టితో తయారుచేసిన విఘ్నేశ్వరుడి ప్రతిమను ప్రతిష్ఠించి పూజించాలని వేద పండితులు చెబుతున్నారు. పంచభూతాల్లో ఒకటైన మట్టితో విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని అభిప్రాయపడుతున్నారు. ఆలయాల్లో స్వయంభు దేవతామూర్తుల విగ్రహాలకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో మట్టితో చేసిన గణనాథుడి ప్రతిమకు కూడా విశేష శక్తి ఉంటుందంటున్నారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లాలో సుమారు 30వేల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించనున్నారు. 3, 5, 9, 11 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో సమయానుకూలంగా విగ్రహాలకు విశేష పూజలు చేసిన అనంతరం సమీపంలోని చెరువులు, వంకలు, వాగుల్లో విగ్రహాలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పర్యావరణానికి ముప్పు

ఏటా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసే వినాయకుని విగ్రహాల మూలంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో శుద్ధజలం కలుషితమవుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో విగ్రహాలను తయారుచేసి వీటికి వివిధ రకాల విషతుల్యమైన రంగులను అద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్ది విక్రయిస్తున్నారు. ఇలాంటి విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసిన తర్వాత నీరు కలుషితమవుతోంది. వీటిలో హానికరమైన రసాయనాలు ఉండడం వల్ల నీటిలోని జీవరాశులు మృత్యువాతపడుతున్నాయి. కలుషితమైన నీటిని తాగిన చేపలను తినడం ద్వారా ప్రజలు క్యాన్సర్ వ్యాధి భారిన పడుతున్నారు. అదే మట్టి విగ్రహాలను పూజించిన తర్వాత వాటిని కాల్వలు, చెరువుల్లో నిమజ్జనం చేసినా వాటి వల్ల ఎలాంటి నష్టం లేకపోగా, నీటిలో ఔషధగుణాలు పెంపొందించబడతాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. అధికార యంత్రాంగం, ప్రకతి ప్రేమికులు ఆ దిశగా ప్రజల్లో చైతన్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలకే ప్రజల్లో ఆదరణ ఉండేట్లు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాల్సిన బాధ్యత ఎంతో ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణ సమతుల్యం దెబ్బ తింటోంది. జలాల్లో ఉండే జీవరాశులు కనుమరుగవుతున్నాయి. రంగులతో చేసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల మూలంగా ఏర్పడే అనర్థాల గురించి ప్రజల్లో ఏటా ఇన్నర్‌వీల్ క్లబ్ అవగాహన కల్పిస్తోంది. ఆయా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థుల్లో మట్టి విగ్రహాలపై చైతన్యం కలగజేస్తోంది. మట్టి ప్రతిమలను తయారు చేయించి ప్రజలకు అందజేస్తున్నాం. వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నాం.

–శకుంతలారెడ్డి, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు, డోన్

మనమే తయారు చేసుకోవచ్చు



మట్టితో చిన్న వినాయక ప్రతిమలను ఇంటిలోనే తయారు చేసుకోవాలి. దీంతో పర్యావరణానికి సమస్త జీవరాశులకు ఎంతో మేలు జరుగుతోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేసినప్పుడు అందులోని గణపథార్థాలతో చెరువులు పూడిపోతున్నాయి. జలచరాల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. దీనిని దష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలి. –డాక్టర్ మాధవక్రిష్ణ, అసోసియేటెడ్ ప్రొఫెసర్, నంద్యాల జిల్లా ప్రభుత్వాస్పత్రి

ఆరోగ్య సమాజం కోసం..



భావితరాల సంపూర్ణ ఆయురారోగ్యాల కోసం మట్టి గణపతిని నెలకొల్పి పూజించడం ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలి. హానికరమైన రసాయనిక రంగుల మూలంగా సంస్థ జీవరాశులు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. తద్వారా పర్యావరణ సమతుల్యం దెబ్బతిని మానవ మనుగడకే పెను ప్రమాదం పొంచి ఉంది. భవిష్యత్తు తరాల కోసం బాధ్యతగా భావించి ఎకో గణపతిని పూజిద్దాం. –శ్రీనివాసులు, డీఎస్పీ, డోన్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 2003–04 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 21 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉన్నత విలువలతో కూడిన బోధన అందించడంతోనే తాము ఈ స్థాయికి చేరుకున్నామని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం హెచ్ఎం సుశీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సీతారామాంజనేయులు, మల్లయ్య, చంద్రశేఖర్‌రాజు, కలేనాయక్, శివశంకరయ్య, నాగేంద్రకుమార్, ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, పుల్లారెడ్డి, చంద్రశేఖర్, నాగేశులులను పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు సుదర్శన్‌రెడ్డి, చంద్రన్న, గోపాల ఆచారి, సురేంద్ర, క్రిష్ణనాయుడు, లక్ష్మీదేవి, సుభద్ర పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి

ప్యాపిలి: రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. గత వారం రాష్ట్రంలో విరివిగా వర్షాలు కురవడంతో నీరు నిలిచిన పొలాలు, నీటి ముంపునకు గురైన మాగాణి పొలాల్లో రైతులు యూరియా వాడతారని తెలిపారు. వర్షాధార మెట్ట పైర్లలో పదును దాటకముందే రెండు, మూడు రోజుల్లోనే యూరియా వాడాల్సిన అవసరం ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతాంగానికి యూరియా అవసరం చాలా ఉందన్నారు. దీంతో రైతులు చాలా చోట్ల యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలిచినా యూరియా లభించని పరిస్థితి నెలకొందన్నారు. యూరియా నిలువలపై వ్యవసాయశాఖ అధికారులు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతనలేదన్నారు. కొన్ని దుకాణాల్లో యూరియా కొనాలంటే నానో యూరియా కొనాల్సిందే అన్న నిబంధన పెడుతున్నారని తెలిపారు. నానో యూరియాతో వరి, గోధుమల్లో దిగుబడి తగ్గుతుందని పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఓ రిపోర్టులో వెల్లడించినట్లు చెప్పారు. నానో యూరియాతో ఉపయోగం ఉంటే రైతులు స్వచ్ఛందంగా కొంటారని బలవంతంగా విక్రయించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు.

కోవెలకుంట్లలో కార్డన్‌సెర్చ్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని జగనన్న కాలనీలో కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కోవెలకుంట్ల, రేవనూరు, సంజామల ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు లభ్యం కాలేదు. అనంతరం కాలనీవాసులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలు, చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని పేర్కొన్నారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. గొడవలు, ఘర్షణలు, అలజడులు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు పోలీసులు భావిస్తే వారిపై షీట్లు ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న దేవరాజు

కోవెలకుంట్ల : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు అందనం దేవరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్టిఫికేట్ల పరిశీలన పేరుతో పింఛన్లు తొలగించడం అన్యాయమని విమర్శించారు. దివ్యాంగత్వ శాతం కేటాయింపులో పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు శాతం రిజర్వేషన్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. ఐదు లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకై సోమవారం జరగనున్న దివ్యాంగుల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు ఆలీఖాన్, రమణ, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గోపాలుడి గ్రామోత్సవం

సంజామల: మండలంలోని పేరుసోముల గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు కొనసాగిన ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి విశిష్ట పూజలు చేశారు. అనంతరం భగవద్గీత శ్లోకాల పఠనంతో శ్రీకృష్ణుని గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక పేరుసోముల కమిటీ అధ్యక్షుడు సురేష్, రెడ్డిపల్లె మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, తత్తేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కమిటీ సభ్యులు మిక్కినేనిపల్లె పెద్దయ్య, గణపతి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పేరుసోములలో శ్రీకృష్ణుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు చెప్పారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని ఆయా గ్రామాలకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి సోమవారం నుంచి పగటిపూట తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తోన్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల వారీగా విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉద యం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అందించనున్నట్లు వెల్లడించారు.

స్థలం విషయంలో వ్యక్తిపై దాడి

కొలిమిగుండ్ల: పెట్నికోటలో కల్లంకు చెందిన స్థలం విషయంలో ఆదివారం వ్యక్తిపై దాడి చేయడంతో గాయపడ్డాడు. గ్రామానికి చెందిన నారబోయిన మధుకు సంజన మల్లిఖార్జున మధ్య కల్లం విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. దీనిపై ఇరువురి మధ్య మాటలు పెరిగాయి. చివరకు మల్లిఖార్జున మధు తలపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారించి మల్లిఖార్జునతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే గాజులదిన్నె ప్రాజెక్టు పైపులైన్‌లో కొటకొండ-సంగాల గ్రామాల మధ్య లీకేజీలు ఏర్పడడంతో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. ఈ కారణంగా 25, 26 తేదీల్లో పట్టణానికి మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు చోట్ల లీకేజీలను గుర్తించామని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 27వ తేదీ బుధవారం నుంచి సరఫరాను యథావిధిగా పునరుద్ధరిస్తామని చెప్పారు. ఈలోగా ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ అమెనిటీ సెక్రటరీ గోవిందనాయక్‌ను 94905 73120 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ప్యాపిలి: యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మధుసూదన్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. యూరియా కొరతను ఆసరాగా తీసుకుని ఫర్టిలైజర్స్ దుకాణదారులు అధిక ధరలకు విక్రయించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణదారులు రైతులు చేసే అన్ని కొనుగోళ్లకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. నిర్ణీత ధరకంటే అధిక ధరలకు విక్రయించకూడదన్నారు.

నూతన కమిటీ

డోన్ టౌన్ : నంద్యాల పట్టణంలోని సన్‌రైజ్ స్కూల్‌లో ఆదివారం జరిగిన జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డోన్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామమూర్తి జిల్లా అధ్యక్షుడిగా, అబ్దుల్ లతీఫ్, సర్వజ్ఞమూర్తిలను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసినట్లు ఎన్నికల పరిశీలకుడు మురళీధర్ ప్రకటించారు. వీరి ఎన్నికపై యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, ప్యాపిలి మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు సంజీవరాయుడు, చంద్రమోహన్, మధు తదితరులు అభినందనలు తెలిపారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం

డోన్ టౌన్: చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ స్కూటర్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ఘటన డోన్ పట్టణంలోని కృష్ణా లాడ్జి సమీపంలో ఉన్న భారత్ గ్యాస్ వెనుక వీధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్కూటర్ దగ్ధం కావడంతో పక్కనే ఉన్న వాషింగ్ మిషన్, వరండాలో ఉన్న సైకిళ్లు, పలు గృహోపకరణ వస్తువులకు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక కేంద్రానికి బాధితుడు కృష్ణమూర్తి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపు చేశారు. అప్పటికే స్కూటర్ పూర్తిగా కాలిపోయింది.

ఉద్యోగుల ఐకమత్యంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి

బనగానపల్లె రూరల్: ఉద్యోగులంతా ఐకమత్యంగా ఉంటేనే హక్కులు, డిమాండ్లు సాధించుకోవచ్చని నేషనల్ మజ్దూరు యూనియన్ (ఎన్‌ఎంయూ) జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లెలోని యాగంటిపల్లె రహదారిలోని మర్చంట్ భవనంలో ఎన్‌ఎంయూ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, డిపో కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ..కార్మికులంతా ఏకమై కదిలితేనే మన సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. అనంతరం బనగానపల్లె డిపో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో మద్దయ్యను డిపో అడ్వైజర్‌గా, జంబులయ్యను అధ్యక్షుడిగా, శ్రీనివాసులను కార్యదర్శిగా, దేవేందర్ రెడ్డిని గ్యారేజ్ కార్యదర్శిగా, గఫూర్‌తో పాటు మరికొందరిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్షుడు సుదర్శనం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సి. మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై. భద్రవతి, జిల్లా చైర్మన్ కోటేశ్వరరావు, కార్యదర్శి శివరామ్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



నేడు: గ్రావెల్ వేసిన తర్వాత ఇలా



నాడు: బురదమయంగా ఉన్న రోడ్డు (ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి మహాలక్ష్మి ఆసుపత్రి దారిలో నూతన భవన సముదాయాల నిర్మాణం వల్ల రహదారి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఇటీవల సాక్షి పత్రికలో ''పట్టు తప్పితే ప్రమాదమే'' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనం వెలువడిన వెంటనే భవన నిర్మాణదారులు అప్రమత్తమై, రోడ్డుపై కంకర వేసి రిపేరు చేసి రాకపోకలకు అనువుగా మార్చారు. దీంతో ఆ మార్గం మీదుగా ప్రయాణించే ప్రజలు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

చవితి ఉత్సవాలపై నేడు సమీక్ష



అగ్నిమాపక అధికారికి ఆహ్వానం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

డోన్ టౌన్: వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించేందుకు సోమవారం సాయంత్రం 4 గంటలకు పాతపేట రామాలయంలో ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశం జరగనుంది. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు కొట్రికె ఫణిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సందు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయగౌడ్‌లు ఈ విషయాన్ని వెల్లడించారు.ఆదివారం ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ రవికుమార్, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, అగ్నిమాపక కేంద్ర అధికారి రంగస్వామిగౌడ్‌లను కలిసి సమావేశానికి ఆహ్వానం పలికారు. గణేష్ ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సభ్యులు శ్రీరామ్, అంబికేశ్వర్, శేఖర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు



వసీమా

ప్యాపిలి: పట్టణానికి చెందిన గఫూర్, జరీనాల కుమార్తె వసీమా ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఆదివారం విడుదలైన మొదటి విడతలో తిరుపతి బాలాజీ మెడికల్ కాలేజీలో సీటు సాధించినట్లు వసీమ తల్లిదండ్రులు తెలిపారు. వైద్యురాలు కావాలని కలలు కన్న తమ కుమార్తెకు ఎంబీబీఎస్‌లో సీటు రావడం సంతోషంగా ఉందన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందిస్తానని వసీమా తెలిపారు.

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యదర్శి భానుసింగ్

డోన్: ప్రభుత్వ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం పెన్షనర్లకు రావాల్సిన బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. జీవిత చరమాంకంలో కుటుంబ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న పెన్షనర్లకు రావాల్సిన బకాయిలన్నింటినీ చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, నాయకులు దాసప్ప పాల్గొన్నారు.

సురవరం మృతికి సంతాపం

సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతి పేద, బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటని భానుసింగ్ పేర్కొన్నారు. ఆయన మృతికి సంఘం సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ

బేతంచెర్ల: మండలంలోని రౌడీ షీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవనం గడపాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలు, అక్రమ మద్యం, నాటుసారా, పేకాట, మాట్కా కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులను మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. మంచి ప్రవర్తన ప్రదర్శిస్తే మీపై ఉన్న రౌడీ షీట్లు తొలగించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.